

## పండుగ పూట ప్రత్యేక అలంకరణ

పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప ఆలయంలో భక్తులు సోమవారం రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. జ్యోతిస్వరూపనే శరణమయ్యప్ప అంటూ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచే అయ్యప్పకు విశేష అభిషేకాలతోపాటు మహామంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మకర జ్యోతిని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

-షాద్‌నగర్‌టౌన్, జనవరి 16

# పెండింగ్‌లో ₹10 కోట్ల చెల్లింపులు

## 'మన ఊరు-మన బడి' పనులకు బ్రేక్

- పేమెంట్స్ కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- నిధులు విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- వికారాబాద్ జిల్లాలో నిలిచిన పనులు
- ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పన కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం
- మొదటి విడుతలో జిల్లాలో 371 స్కూళ్లు ఎంపిక
- 20 ప్రభుత్వ బడుల్లో పూర్తైన పనులు




వికారాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు-మన బడి కార్యక్రమానికి బ్రేక్ పడింది. జిల్లావ్యాప్తంగా ఆ పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. 'మన ఊరు-మన బడి'లో భాగంగా మొదటి విడుతలో ఎంపికైన అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన ఊరు-మన బడి కార్యక్రమ పనుల కొనసాగింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సందిగ్ధం నెలకొన్నది. మరోవైపు ఇప్పటివరకు స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తైనా బిల్లులు రాకపోవడంతో పెండింగ్ చెల్లింపుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో 371 స్కూళ్లను 'మన ఊరు-మన బడి'లో భాగంగా ప్రభుత్వం ఎంపిక చేయగా, 20 స్కూళ్లలో పనులు పూర్తై వాటిని ప్రారంభించగా.. మరో నాలుగు స్కూళ్లలో పనులను ప్రారంభించలేదు. మిగిలిన 347 స్కూళ్లలో పనులు 20 శాతం మేర పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.10 కోట్ల చెల్లింపులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది. అయితే మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా.. రద్దు చేస్తుందా అనేది స్పష్టత రావాల్సి ఉన్నది.

### మధ్యాహ్న భోజనానికీ పైసల్లేవ్..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టేందుకు అమల్లోకి తీసుకొచ్చిన మధ్యాహ్న భోజన పథకానికి కూడా నిధులు రావడం లేదు. గత మూడు నెలలుగా మధ్యాహ్న భోజన పథకానికి నిధులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్ నెల నుంచి మధ్యాహ్న భోజన పథకానికి నిధులు రావాల్సి ఉన్నది. గత మూడు నెలలలుగా రూ.1.06 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.


వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల

మన ఊరు-మన బడి కార్యక్రమంతో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో రూపురేఖలు మారిపోయాయి. సర్కారు స్కూళ్లలో సకల వసతు లు కల్పించడంతో కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయి. మొదటి విడుతలో జిల్లాలోని మండలానికి, మున్సిపాలిటీకి రెండు చొప్పున ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేయగా అందులోని 20 బడుల్లో తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్

### 20 ప్రభుత్వ బడుల్లో మారిన రూపురేఖలు..

బోర్డులు, పెయింటింగ్, ప్రహరీలు, కిచెన్ షెడ్‌ల నిర్మాణం, శిథిలమైన తరగతి గదుల స్థానంలో కొత్తవి, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాల ల్లో డైనింగ్ హాళ్లు తదితర వసతులను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే జిల్లావ్యాప్తంగా 1054 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిలో మొదటి విడుతలో 371 స్కూళ్లలో అవసరమైన వసతులను కల్పిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మొదటి విడుతలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు-111, ప్రాథమికోన్నత పాఠశాలలు-40, ప్రాథమిక పాఠశాలలు-220 ఉన్నాయి. మరోవైపు 'మన ఊరు-మన బడి'లో భాగంగా పనులు జరుగుతున్న జిల్లాలోని 160 స్కూళ్లకు నియమించిన నైట్ వాచ్‌మెన్ల కొనసాగింపు కూడా అయోమయంలో పడిపోయింది.


కడ్తాల్ మండలంలోని ఏక్వాయిపల్లి గ్రామంలో మహిళల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ (ఫైల్)

# ముందే ముగించారు..

- గడువుకు ముందే పూర్తైన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ
- రంగారెడ్డి జిల్లాలో అభయహస్తం దరఖాస్తులు మొత్తం 5.09 లక్షలు
- తదుపరి ప్రభుత్వ ఆదేశాల కోసం అధికారుల ఎదురుచూపులు
- ఇంటింటికెళ్లి దరఖాస్తులను పరిశీలించే అవకాశం!

రంగారెడ్డి, జనవరి 16(నమస్తే తెలంగాణ): 558 గ్రామ పంచాయతీలు.. 16 మున్సిపాలిటీలు.. 11 రోజులు.. 5,09,849 దరఖాస్తులు.. 1,439 మంది ఆపరేటర్లు.. వెరసి గడువుకు ముందే ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ముగించారు. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఐదు పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు రాగా.. జనవరి 7 నుంచి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. 17 వరకు గడువు ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం గడువుకు ఒక్కరోజు ముందుగానే మంగళవారం నాటి కే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసిం ది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

### సవాళ్లను అధిగమించి..

దరఖాస్తుల ఆన్‌లైన్ సందర్భంగా అక్కడక్కడా కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఆపరేటర్ల కొరత సైతం దరఖాస్తుల నమోదుకు ప్రతిబంధకంగా మారింది. వీటన్నింటిని జిల్లా యంత్రాం గం అధిగమించి అనుకున్న సమయానికే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. జిల్లాలో 21 మండలాల్లోని 558 గ్రామ పంచాయతీల పరిధిలో 2,46,626 కుటుంబాలున్నాయి. వీటి పరిధిలో 2,95,060 దరఖాస్తులొచ్చాయి. అలాగే 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 2,88,361 కుటుంబాలుండగా..2,14,789 దరఖాస్తులొ చ్చాయి. ఉపాధిహామీ, సెర్ప్, మండల, రెవెన్యూ, విద్యా శాఖతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో డేటా ఎంట్రీ ప్రక్రియను చేపట్టారు. కొంతమంది ఆపరేటర్లను ప్రైవేటుగా నియమించి దరఖాస్తులను కంప్యూటరీకరించారు. దరఖాస్తులోని 27 అంశాలను పథకాల వారీగా పకడ్బందీగా నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ ముగియడంతో అధికారుల బృందాలు ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తుల పరిశీలనను చేపట్టనున్నట్లు తెలుస్తున్నది. ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో! తెలుసుకునేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేరంటూ ఏమీలేదు. అయితే ప్రజలు ఆసక్తి చూపిన ఆధారంగా..దరఖాస్తుల్లో ఎక్కువగా మహాలక్ష్మి, గృహ జ్యోతి పథకాలకే దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు సమాచారం. మహాలక్ష్మి పథకంలో మహిళలకు

### ఇంటింటి సర్వేతో దరఖాస్తుల పరిశీలన..!

రూ.2,500, రూ.500కే గ్యాస్ బండను అందించనున్నారు. గృహ జ్యోతిలో ప్రతి కుటుంబానికీ 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా ఇవ్వనున్నారు. తదుపరి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, చేయూత దరఖాస్తులున్నట్లు తెలుస్తున్నది. అభయ హస్తం ఐదు పథకాలతోపాటు రేషన్ కార్డు, ఇతర వ్యక్తిగత లబ్ధికి సంబంధించి తెల్లకాగితంపై విజ్ఞప్తులు వచ్చాయి. ఈ తరహా దరఖాస్తులు అర్బన్, రూరల్ ఏరియాలో కలిపి మొత్తం 95,886 వచ్చాయి. ప్రస్తుతానికి అర్హుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చాక మరో దఫా సర్వే చేసి అర్హుల పేర్లను పోర్టల్‌లో ఉంచుతారని అధికారవర్గాలు చెబుతున్నాయి.



## ఇంటి లోగిళ్లు.. ఇంద్రధనస్సులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో కళ కళ లాడింది. మూడు రోజుల పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. ఆడపడుచులు ఉదయాన్నే ఇండ్ల ఎదుట రంగురంగుల ముగ్గులేసి ఆకట్టుకున్నారు. చిన్నాపెద్ద గాలిపటాలను ఎగురవేసి ఆనందంగా గడిపారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, జానపద కళాకారులు పల్లెల్లో సందడి చేశారు.


పెద్దేముల్ : చైతన్యనగర్‌లో ప్రధాని మోదీ సందేశాన్ని లైవ్ స్క్రీన్‌లో వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పక్కన వికారాబాద్ జడ్పీచైర్ పర్సన్ సునీతారెడ్డి, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చెంచు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు



కడ్తాల్ : చెంచుల వైద్య సదుపాయం కోసం ఏర్పాటు చేసిన సంచార వైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల్‌విమల్, గురుకులాల కార్యదర్శి నవీన్, కలెక్టర్ శశాంక

## పండుగలా ప్రారంభోత్సవం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పీఎం జన్‌మన్ కార్యక్రమం సోమవారం పండుగలా సాగింది. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని చైతన్య నగర్ గ్రామంలో లైవ్ స్క్రీన్ వర్చువల్‌గా పీఎం మోదీతో కలిసి ఈ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒకేసారి ప్రారంభించారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన వర్చువల్ మీటింగ్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంకతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధాని సందేశాన్ని చెంచుజాతి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధగా విన్నారు. ఆ తర్వాత చెంచు లబ్ధిదారులకు వివిధ పథకాలకు సంబంధించిన కార్డులను అధికారులు అందజేశారు. అనంతరం చెంచుల వైద్య సదుపాయం కోసం ఏర్పాటు చేసిన నూతన అంబులెన్స్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల్‌విమల్, గురుకులాల కార్యదర్శి నవీన్, రంగారెడ్డి కలెక్టర్, ఇతర అధికారులు ప్రారంభించారు.

-పెద్దేముల్/కడ్తాల్, జనవరి 16


తట్టిఅన్నారంలోని ఉన్నత పాఠశాల వద్ద కమ్ముకున్న పొగమంచు

## కమ్మేసిన పొగమంచు

మున్సిపాలిటీలో మంగళ వారం పొగమంచు కమ్ముకున్నది. తెల్లవారుజాము నుంచి ఉద యం 9 గంటల వరకూ పొగమంచు దట్టంగా ఉన్నది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు. కొందరు ప్రయాణికులు రోడ్ల పక్కన వాహనాలను నిలిపి మంచు పోయిన తర్వాత తమ స్వస్థలాలకు వెళ్లారు. పిల్లలు, వృద్ధులు చలితో వణికిపోయారు.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 16